క్లుప్తంగా

గోశాలకు అల్యూమినియం పాత్రల వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు శనివారం ఉండికి చెందిన నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు రూ.8 వేలు విలువ చేసే అల్యూమినియం పాత్రలు వితరణ చేసింది. ఈ మేరకు ట్రస్టు చైర్మన్ నల్లా కిరణ్ ప్రసాద్ వీటిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో సిబ్బందికి అందజేశారు. స్వామివారి సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అవి సోకిన వారు నిర్లక్ష్యంగా ఉండకుండా వైద్యులను సంప్రదించాలని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, సీనియర్ లయన్ పీకే రావులు అన్నారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద లయన్ బెహరా వీర హనుమంతరావు సహకారంతో అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో శనివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, డయాబెటిక్, ఈసీజీ, కంటి వైద్య పరీక్షలతో పాటు, సాధారణ వైద్య సేవలను కిమ్స్ వైద్య సిబ్బంది అందించారు. సుమారు 145 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు జీవీఎస్.మల్లిబాబు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో వైస్ సర్పంచ్ వీరా రవి, మాజీ సర్పంచ్‌లు నూకపెయ్యి చిన్న, అండె సూర్యనారాయణమూర్తి, కాండ్రేగుల గోపి, సీనియర్ లయన్స్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో కలెక్టర్ దంపతులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి జలకం

అంబాజీపేట: తొండవరం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత రాజ్యలక్ష్మి అమ్మవారి జలకాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు, నైవేద్యాలు చెల్లించుకున్నారు. అమ్మవారి జలకం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఉన్న కాలనీల్లో అమ్మవారి పూజ ఘటాలను ఊరేగిస్తూ జలకం నిర్వహించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని పారిశుధ్య సిబ్బంది పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని జేసీబీల ద్వారా తవ్వి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పర్చుతున్నారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్నట్లు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

అతిసారను అరికడదాం

అయినవిల్లి: సామూహికంగా అతిసారను అరికడదామని ఎంపీడీఓ టి.సూర్యనారాయణమూర్తి, తహసీల్దార్ ప్రమద్వర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్టాప్ డయేరియా మాసోత్సవ కార్యక్రమంపై వీరవల్లపాలెం, అయినవిల్లి పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు మంగాదేవి, విజయ్, సౌజన్యల నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది అంగన్వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం వంటి అంశాలను సిబ్బందికి వివరించారు. ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాలు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు జరుగుతాయని సిబ్బంది అందరూ ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కలిగించి నియంత్రణ చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, ప్రసాద్, రామారావు, జయలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఫెడోరా హెల్త్ కేర్'కు ఎంపికైన విద్యార్థులు

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ఎయిడెడ్ కళాశాల విద్యార్థులు ఫెడోరా హెల్త్ కేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విజయవాడకు చెందిన టెక్నోస్పార్క్ అనే మెడికల్ కోడింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన పి.నవ్య శ్రీదేవి, బి.వినిష్కలు 'ఫెడోరా హెల్త్ కేర్'కంపెనీలో మెడికల్ కోడర్‌గా ఎంపికయ్యారు. శనివారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ మూర్తి వారిని అభినందించారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) ఆలయం శనివారం కిక్కిరిసింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,55,450, అన్నప్రసాద విరాళాలుగా రూ.44,619 వచ్చిందని ఈఓ తెలిపారు.

చిటికెలో పేమెంట్

- ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ పేమెంట్లకు పెరుగుతున్న ఆదరణ



అంబాజీపేటలో పాన్‌షాప్‌లో ఉన్న యూపీఐ స్కానర్

అంబాజీపేట: మారుతున్న నేటి కాలాన్ని బట్టి వ్యాపార లావాదేవీలన్నీ నగదు రహితంగానే నిర్వహిస్తున్నారు. పెద్ద మాల్స్ నుంచి రోడ్డు పక్కన పండ్లు, వివిధ సామగ్రి విక్రయాలు జరిపే చిరు దుకాణాలు, తోపుడు బండ్లపై నిర్వహించే వ్యాపారాల్లో సైతం సెకన్లలో ఆన్‌లైన్ పేమెంట్స్ చేసేస్తున్నారు. దీంతో బ్యాంకుల్లో సైతం నగదు మారక శాతం తగ్గినట్లు తెలుస్తోంది. నగదు లావాదేవీలకు సంబంధించి కాగితాల కంటే వివిధ రకాలుగా నిర్వహిస్తున్న నగదు రహిత లావాదేవీలకే పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో 11 మండలాలకు సంబంధించి జనం మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారాల్లో అధిక శాతం నగదు రహితంగా ఏర్పాటు చేసుకున్న వివిధ కంపెనీలకు చెందిన స్కానర్ల ద్వారా డబ్బు మారకం జరుగుతుంది. మార్కెట్లో నిత్యం జరిగే లక్షలాది రూపాయిల క్రయ విక్రయాల్లో 70 శాతం ఆన్‌లైన్ పేమెంట్ రూపంలో జరుగుతుందని వ్యాపారులే చెబుతున్నారు.

మొబైల్ యాప్ ద్వారా..

దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన వివిధ కంపెనీలకు చెందిన స్కానర్లను వినియోగదారులు తమమొబైల్లో ఉన్న ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, వాట్సాప్ వంటి యాప్‌ల ద్వారా నగదును బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యేలా స్కాన్ చేస్తున్నారు. అంతేకాకుండా వ్యాపార రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న నగదు రహిత లావాదేవీల కారణంగా బ్యాంకుల్లోను, ఏటీఎం సెంటర్ల వద్ద ఖాతాదారుల రద్దీ కూడా తగ్గింది. చిరు వ్యాపారాల్లో స్కానర్ల ద్వారా నగదు మారకం ఆన్‌లైన్‌లో జరుగుతుండగా, మాల్స్, సూపర్ బజార్, పెట్రోలు బంకులో మాత్రం వారి వద్ద ఉన్న మెషీన్లలో వినియోగదారులకు సంబంధించిన వివిధ బ్యాంకుల డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు. దీంతో నగదు మారకం చాలా సులువుగా జరుగుతున్న పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి.

చిల్లరకు చెక్..

వ్యాపారస్తుడి నోటి నుంచి ఎక్కువగా వినపడేది చిల్లర కావాలనే పదం. కానీ నేడు అధిక శాతం జరుగుతున్న నగదు రహిత లావాదేవీలతో చిల్లర అనే పదం కూడా వినిపించని పరిస్థితి నెలకొంది. గతంలో ఆన్‌లైన్ పేమెంట్ సౌకర్యం లేని సమయంలో చిల్లర నాణేలతో కూడా వ్యాపారం చేసేవారు. నూటికి రూ.5 నుంచి రూ.10 కమీషన్ తీసుకునే పరిస్థితి ఉండేది. కానీ నేడు జరుగుతున్న నగదు రహిత లావాదేవీలతో పేమెంట్ చేశామనే సాక్ష్యం కూడా చూపించే విధానం వ్యాపారుల్లో సంతృప్తినిస్తుంది.

ముమ్మరంగా పారిశుధ్య చర్యలు


మామిడికుదురులో చేపట్టిన పారిశుధ్యం పనుల్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ భరతలక్ష్మి

మామిడికుదురు: కోనసీమ జిల్లాలో డయేరియా తదితర అంటువ్యాధులు ప్రబలకుండా సంపూర్ణ పారిశుధ్యం పనులు చేపట్టారని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ సీహెచ్‌వీ భరతలక్ష్మి తెలిపారు. మామిడికుదురులో శనివారం ఆమె పర్యటించారు. ఇక్కడ జరుగుతున్న ఇంటింటా ఫీవర్ సర్వేను పరిశీలించారు. దీంతో పాటు పారిశుధ్యం జరుగుతున్న తీరును కూడా పరిశీలించారు. మామిడికుదురులో రెండు మలేరియా అనుమానిత కేసులు నమోదయ్యాయన్నారు. మలేరియా అనుమానితులు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఈ పరిణామాలతో మూడు బృందాలతో ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టామన్నారు. వర్షాకాలం కావడంతో డయేరియా కేసులు నమోదు కాకుండా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని చెప్పారు. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, స్టాప్ డయేరియా వంటి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, సీహెచ్ఓ సత్యవతి, పీహెచ్ఎన్ నారాయణమ్మ, ఎంపీహెచ్ఎస్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కేవీ శ్రీనివాసరావు, ఏఎన్ఎం ఎం.జయకుమారి, కె.దుర్గాదేవి పాల్గొన్నారు.

నన్ను ఆధునీకరించండి మహాప్రభో..

వయసు పైబడిందని అధికారులకు వేడుకోలు



నా వయస్సు పై బడి దాదాపు కూలేందుకు సిద్ధంగా ఉన్నాను. నన్ను 1974లో నిర్మించారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో నేను ఒక్కడినే ఈ ప్రాంత వాసులకు ఆధారం. అప్పుడు వ్యవసాయ సంబంధ ఉత్పత్తులు తరలించేందుకే నన్ను నిర్మించారు. నేను అయినవిల్లి మీదుగా నేదునూరు, ముక్కామల ప్రయాణికులు, వాహనాలు వెళ్లడానికి నిర్మించారు. ఇప్పుడు నేను భరించ లేనంత బరువు నా పైనుంచి రోజూ వెళుతుంది. నేను భరించలేనంత బరువున్న భారీ వాహనాలు నా పైనుంచి వెళ్తున్నాయి. ఆ బరువును నేను భరించలేక ఎప్పుడు కూలిపోతానో నాకే తెలియదు. నాపై వెళ్లే వారికి ఎటువంటి ప్రమాదం వాటిల్లుతుందో చెప్పలేను. ఇప్పటికే నాకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ తుప్పు పట్టి ఊడిపోయాయి. నా కింద వంతెన నిలబడగానికి ఏర్పాటు చేసి ఇనుప గడ్డర్ తుప్పు పట్టింది. నాకు అతికిన సిమెంట్ అచ్చులు అచ్చులుగా ఊడిపోయింది. కనీస మరమ్మతులు చేసినా నేను నిలబడే స్థితిలో లేను. నేను కుంగిపోయి ప్రమాదానికి కారణం కాకముందే నన్ను కూల్చి నూతనంగా నిర్మించాలని వేడుకుంటున్నాను. – అయినవిల్లి

ఇట్లు : అయినవిల్లి పంట కాలువ వంతెన

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి


మలికిపురంలో ఎమ్మెల్యే దేవ వర ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మలికిపురం: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం కోరింది. ఈ మేరకు మలికిపురంలో మలికిపురం, సఖినేటిపల్లి మండలాల పీఆర్‌టీయూ శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దేవను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించిన అనంతరం వివిధ వినతులతో కూడా పత్రాన్ని ఆయనకు అందించారు. 117 జీఓను ఉప సంహరించాలని సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. అమ్మకు వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింప చేయాలని కోరారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, గుబ్బల సింహాచలం, భైరవమూర్తి, ఎ.రామకృష్ణ, పెద్దిరాజు, నీలారావు, గిరి ప్రసాద్, యాతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పీఎం ఫొటో పెట్టాలి

కొత్తపేట: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు కోరారు. ఆ మేరకు గెజిట్ విడుదల చేయాలని పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌డీఏ భాగస్వామ్యంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ కంకణబద్ధులై పని చేస్తున్నారన్నారు. విశ్వగురు స్థానంలో భారత్‌ను ప్రపంచ దేశాల ముందు నిలబెట్టి పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ నెలకొల్పడానికి కృషి చేస్తున్న మోదీజీ ఫొటో ఏర్పాటు చేయడం ఆయనకు మనం ఇచ్చే గౌరవమని పాలూరి సత్యానందం అన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులకు అడ్డుకట్ట


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి

అయినవిల్లి: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని ఎంపీడీఓ టి.సూర్యనారాయణమూర్తి అన్నారు. శనివారం ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'డెంగీ వ్యతిరేక మాసోత్సవం'లో భాగంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో టీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. దానిలో భాగంగా అందరి భాగస్వామ్యంతో వివిధ కమిటీలు ఏర్పాటు చేశామని, ఋతుపవనాల ఆగమనం సందర్భంలో అనేక సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు సురక్షిత తాగునీరు, తాజా ఆహారం తీసుకోవాలని, మన పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి బి.మంగాదేవి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులందరూ శ్రద్ధ వహించాలన్నారు. దోమలు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.భాస్కరరావు, జి.సాయి శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి


కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

కొత్తపేట: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి అన్నారు. డీఈఓ కమలకుమారి శనివారం మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ నూతనంగా ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలు తీరుతెన్నులను పర్యవేక్షించారు. దానిలో భాగంగా ఎంఈఓలు, ఉపాధ్యాయులతో విద్యాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ 6 సంవత్సరాల వయసు నుంచి బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. మధ్యలో బడి మానేస్తున్న చిన్నారులను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్‌ఎంలు ఎస్.సత్యనారాయణ, బండారు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడలో..

ఆలమూరు: బడి ఈడు పిల్లలు బడి బయట ఉండరాదని బడిలో ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాల కోఆర్డినేటర్ డి.రమేష్ అన్నారు. మండలంలోని జొన్నాడలో శనివారం స్థానిక విద్యా శాఖాధికారులతో కలసి పర్యటించారు. పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల్లో నివసిస్తున్న కార్మికుల కుటుంబాలను సందర్శించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు కార్మికులకు వివరించారు. బడి ఈడు పిల్లలను పనిలో పడితే తీవ్ర నేరంగా పరిణగింప బడుతుందని హెచ్చరించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యాబోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలసి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించే నేను బడికి పోదాం అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చింతా శ్రీనివాసరెడ్డి, సీఆర్‌పీ గంటి శ్రీనివాసు, పీటీఈ దారపురెడ్డి సత్య పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి నిధుల విడుదల

మలికిపురం: మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పింఛన్లు అందిస్తామని అమలాపురం డివిజల్ పంచాయతీ అభివృద్ధి అధికారి బి.వీరాస్వామి పేర్కొన్నారు. శనివారం మలికిపురం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ పంపిణీ ఏర్పాటును అధికారులు, కార్యదర్శులతో సమీక్షించారు. జులై నెల పింఛను రు.7,000 పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నెలకు రు.1000 చొప్పున 3 నెలలకు రు.3000 జులై నెల పింఛను సొమ్ము రు.4000 తో కలిపి జులై నెల 1 వ తేదీన పింఛను సొమ్ము రు.7,000 లబ్ధిదారులకు అందుతుందన్నారు. సచివాలయం సిబ్బందితో మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించిన ప్రకారం మలికిపురం మండలంలోని 10,729 పింఛన్లు పంపిణీ చేయడానికి అవసరమైన 177 సిబ్బందిని ఇప్పటికే మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు.. మలికిపురం మండలంలోని 23 సచివాలయాలకు జూలై నెల పింఛన్ల కోసం ఇప్పటికే జమ అయిన సొమ్ము డ్రా చేసి సిద్ధం చేసుకోవాలని సంబంధిత పంచాయితీ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీడీఓ బి.మంగాదేవి, పరిపాలన అధికారి జి.మిల్టన్, సీనియర్ అసిస్టెంట్ కె.పద్మరాజు, జూనియర్ అసిస్టెంట్ జి. ప్రవీణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లో 10,144 మంది లబ్ధిదారులకు జూలై 1న పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి తెలిపారు. పింఛన్ల పంపిణీపై మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. మొదటి రోజే పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. డ్వాక్రా వీఓఏల సహాయం కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి వారి ఇంటి వద్దే పింఛన్లు అందించాలని సూచించారు. పింఛన్ల పంపిణీకి 203 మంది సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉన్న గ్రామాలకు ఇతర గ్రామాల నుంచి ఉద్యోగులను కేటాయించామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీఎం డి.అజయ్ పాల్గొన్నారు.

ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీలను రెగ్యులర్ చేయాలి


డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న పీటీఐలు

అంబాజీపేట: సమగ్ర శిక్షలో 2012 నుంచి పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ (ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పీఈటీ)లను రెగ్యులర్ చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరారు. తొండవరంలో ఎమ్మెల్యేను కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌లు మాట్లాడుతూ 2012 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర శిక్ష కింద సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. మాకెవరికి ఇప్పటి వరకు ఉద్యోగ భద్రతలేదని, చాలీచాలని జీతాలతో జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఈపీఎఫ్, ఈసీఎస్ వంటివి ఏవీ వర్తించడం లేదన్నారు. పార్ట్ టైమ్ పదం మార్చి ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేయాలని, కనీస వేతనంలో రూ.33 వేలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి సమస్యలు పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ పీటీఐల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అలాగే తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు డైనింగ్ హాల్, సైకిల్ షెడ్, అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి భవనాలు, వంట షెడ్డు, పాఠశాల క్రీడాప్రాంగణం అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని హెచ్‌ఎం పీవీ కేశవాచార్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది


హెచ్‌ఎం శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్థానికులు

అంబాజీపేట: రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న ఉన్నతాధికారుల నుంచి ప్రపంచ దేశాలను పాలిస్తున్న నేతల వరకు ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఆ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న ఖండవిల్లి శ్రీనివాస్ సన్మాన సభ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యార్థుల పట్ల అంకిత భావంతో పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాస్‌ను, ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేసిన గణిత ఉపాధ్యాయుడు వేమూరి రూబేనులను పాఠశాల సిబ్బంది, స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఎంఈవోలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, కనకదుర్గ, ఉప సర్పంచ్ బంధన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో 101 కేసుల పరిష్కారం

రాజోలు: జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజోలు కోర్టు కాంప్లెక్స్ పరిధిలో 101 కేసుల ద్వారా రూ.88.13 లక్షల ఆర్థిక లావాదేవీలను శనివారం పరిష్కరించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.ప్రమీలారాణి ఆధ్వర్యంలో రెండు బెంచ్‌ల ద్వారా 16 సివిల్, 42 క్రిమినల్, 43 ప్రిలిటిగేషన్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి మాట్లాడుతూ ఎంతో కాలంగా ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లను కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. మొదటి బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, రెండో బెంచ్‌లో జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సభ్యులు జి.రజిత, వై.లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

69 కేసుల పరిష్కారం

కొత్తపేట: స్థానిక కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 69 కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన లోక్ అధాలత్‌లో ఐపీసీ కేసులు 40, బీఎస్ఎన్ఎల్ కేసులు 20, బ్యాంక్ పీఎల్‌సీ 3, మెయింటెనెన్స్, మనీ కేసులు 2 చొప్పున, చెక్‌బౌన్స్, ఈపీ కేసులు ఒక్కొక్కటి చొప్పున కేసులు పరిష్కరించారు. ఆయా కేసులకు సంబంధించి రూ.47,94,324 రికవరీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, లోక్ అదాలత్ సభ్యుడు అల్లు భాస్కరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్‌కు పునాది


యూనిఫాం పంపిణీ చేస్తున్న సోమశేఖర్

అయినవిల్లి: విద్యార్థి దశలోనే రేపటి బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని డీఐఈఓ సోమశేఖర్ విద్యార్థులకు ఉద్బోధించారు. ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కొంతసేపు మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.సామ్‌ఎబెల్, కె.స్వర్ణకుమారి సమకూర్చిన రూ.24 వేల నిధులతో 62 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను డీఐఈఓ సోమశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కైలాసభూమి నిర్మాణానికి రూ.58 వేల విరాళం


కొత్తపేటలో రెడ్డియ్యకు విరాళం అందజేస్తున్న శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: స్థానిక తొగరిపాయ (సూర్యగుండాల రేవు) శ్మశాన స్థలం వద్ద కైలాసభూమి నిర్మాణానికి ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్ రూ.58 వేలు విరాళంగా అందజేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంబూరి రెడ్డియ్య ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల క్రితం కైలాసభూమి నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. భారీ బడ్జెట్ అంచనాతో సకల సౌకర్యాలతో కూడిన నిర్మాణం చేపట్టగా సుమారు 70 శాతం నిర్మాణం పూర్తయ్యింది. నిధుల లేమితో ఇంకా సుమారు 30 శాతం నిర్మాణం నిలిచిపోయింది. శవ దహనాలకు ఆ ప్రాంతం తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో చాలా మంది తమ బంధువులు, కుటుంబ సభ్యుల పార్థివ దేహాలను ఎన్నో వ్యయ ప్రయాసలతో రాజమహేంద్రవరం కైలాసభూమికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వెళ్లలేని వారు ఇక్కడే అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. దాంతో అసంపూర్తిగా నిలిచిపోయిన కైలాసభూమి నిర్మాణం పూర్తి చేయాలని పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. దానిలో భాగంగా శనివారం శిల్పి రాజ్‌కుమార్‌వుడయార్ తన విరాళాన్ని కైలాసభూమి నిర్మాత రెడ్డియ్యకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సలాది రామకృష్ణ, బొరుసు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.